


# రహస్యము

**దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక !**

**మూలవాక్యము : మత్తయి 6:4 అట్లయితే రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతి ఫలమిచ్చును**

ఏదైనా ఒక పని ఎవరూ చూడకుండా , ఎవరూ వినకుండా ,ఎవరికీ తెలియకుండా చేయగలిగితే ఆ పని రహస్యముగా చేసినట్టు అని మనిషి నమ్ముతాడు . *దేవునికి రహస్యమైనదేదియు లేదు అని వాక్యము(మత్తయి 10:26) సెలవిస్తుంది . ఈ ఒక్క మాట మనిషి మరచిపోతున్నా డు* అనుకుంటా .................! ఈ విషయము మనిషి మర్చిపోయాడు కనుకనే పాపము చేయగలుగుతున్నాడు . కయీను ,హేబెలును చంపేటప్పుడు ఎవరు చూడడం లేదు అనుకున్నాడు కాని దేవుడు చూసాడు........ దావీదు చాలా తెలివిగా ఊరియాను చంపించాను అని అనుకున్నాడు కాని దేవుడు చూసాడు ................ దావీదుకు శిక్ష విధించాడు.దేవునికి మరుగైయున్నది ఏది లేదు(హెబ్రీ4:13) . మనిషి చేసే ప్రతి క్రియను దేవుడు చూస్తున్నాడు .అంతేకాదు మన హృదయములోని ఆలోచనలు కూడా ఆయన స్పష్టముగా గ్రహించగలడు .అందుకే హృదయ పరిశీలకుడు హృదయ పరిశోధకుడు అనిదేవునికి పేరు(సామెతలు17:3) ................

ఈరోజుల్లో మనిషి తాను రహస్యముగా చేస్తున్నానని , తాను చేసేది ఎవరికీ తెలియదని భ్రమలో బ్రతుకుతున్నాడు . ఆ భ్రమలోనే అన్ని పాపాలు చేస్తున్నాడు (దొంగతనము , వ్యభిచారము,లంచము, సణుగుకొనుట, దూషణ ...........ఇలా చెప్పుకుంటూ పోతే మనిషి చేయని పాపము భూమి మీద లేదేమో ).

అట్లయితే మనిషి చేసే ప్రతి పనికి రహస్యమందు చూచు మన తండ్రి మనకు ప్రతిఫలమిచ్చును. మనిషి ఒక పని రహస్యముగా చేయాలనుకున్నప్పుడు మొదట చీకటిని వెదుకుతాడు. చీకటిలో చేసినప్పుడే మనిషికి ఆ పని రహస్యముగా చేసాను అన్న తృప్తి కలుగుతుంది. అందుకే మనిషి ప్రతి పాపము చీకటిలో చేయడానికి ఇష్టపడతాడు . పాపము చీకటిలో ,చీకటి సంబంధులు చేస్తారు. రహస్యము అన్న అంశము గూర్చి దేవుడు ఏమి సెలవిస్తున్నాడో చూద్దాం .

1. రహస్య పుట్టుక : కీర్తన 139:15 నేను రహస్యమందు పుట్టిననాడు భూమియొక్క అగాధస్థలములలో విచిత్రముగా నిర్మింపబడిననాడు నాకు కలిగినయెముకలును నీకు మరుగై యుండలేదు

మనము రహస్యమందు పుట్టినాము అని గ్రహించాలి .తల్లి గర్భములో మనము వున్నప్పుడు ఎలాగు ఉన్నామో మనకు తెలియదు . ఏ రూపములో ఉన్నామో మన తల్లి,తండ్రులకు తెలియదు. మనలను రూపించింది మనలను రహస్యముగా పుట్టించింది సృష్టికర్త అయిన యేసుక్రీస్తు.




2. **రహస్యముగా జొరబడినవారు : యూదా1:4లో** ఏలయనగా కొందరు **రహస్యముగా జొరబడియున్నారు**. వారు **భక్తిహీనులై** మన దేవుని కృపను **కామాతురత్వమునకు** దుర్వినియోగ పరచుచు, మన అద్వితీయనాధుడును ప్రభువునైన యేసు క్రీస్తును విసర్జించుచున్నారు; ఈ తీర్పుపొందుటకు వారు పూర్వమందే సూచింపబడినవారు.

**ప్రియమైన సేవకులారా ఈ విషయాన్ని మీరు పరిగణలోనికి తీసుకోవలసిందిగా మనవి చేస్తున్నాము. మీ సంఘాలలోకి, సహవాసాలలోకి ఎవరైనా కొత్తవారు వస్తే జాగ్రత్త . వారు భక్తిహీనులై రహస్యముగా జొరబడిన వారు అయితే మీరు కష్టపడి సంపాదించిన ఆత్మలను వారు పాడుచేస్తారు .**

3. **రహస్య వేగులు : గలతీ 2:4** మనలను దాసులుగా చేసికొనవలెనని క్రీస్తు యేసువలన మనకు కలిగిన మన స్వాతంత్ర్యమును వేగు చూచుటకు, రహస్యముగా తేబడి దొంగతనముగా ప్రవేశించిన కపట సహోదరులవలన జరిగినది.

4. **రహస్యముగా బోధ : 2పేతురు 2:1** మరియు అబద్ధప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధబోధకులుందురు; వీరు తమ్మును కొనిన ప్రభువునుకూడ విసర్జించుచు, తమకుతామే శీఘ్రముగా నాశనము కలుగజేసికొనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయములను **రహస్యముగా బోధించుదురు.**

**రహస్యముగా బోధించు అబద్ధబోధకులతో మిక్కిలి జాగ్రత్తగా వుండాలి . ఈరోజు క్రైస్తవ సంఘాలలో ఇలాంటి వారు అధికమైనారు . మిడిమిడి జ్ఞానముతో దేవుని వాక్యాన్ని తప్పుగా బోధిస్తున్నారు . ఇలాంటి వారు అన్యులు క్రైస్తవ్యమును ద్వేషించుచుటకు కారణము అవుతున్నారు. ఈ అబద్ధబోధకుల అజ్ఞానానికి ,వారి అంధకార ఆలోచనలకూ అవధులు లేకుండా పోతున్నాయి . (మార్కు 7:7) మానవుడు కల్పించిన పద్ధతులు దైవోపదేశములు అని భోధించుచు ఆయనను వ్యర్ధముగా ఆరాధిస్తున్నారు.**

5. **రహస్య పనులు :ఎఫెస్సి: 5:12** నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలి వారైయుండక వాటిని ఖండించుడి. ఏలయనగా అట్టి క్రియలు చేయువారు రహస్యమందు జరిగించు పనులను గూర్చి మాటలాడుటయైనను అవమానకరమై యున్నది. **మనిషి అంధకార సంబంధమైన పనులు రహస్యముగా చేస్తున్నాడు(వ్యభిచారము,త్రాగుడు,దొంగతనము,హత్యలు..................)**

6. **రహస్య ధర్మము : మత్తయి 6:3** - నీవైతే ధర్మము చేయునప్పుడు, **నీ ధర్మము రహస్యముగా**నుండు నిమిత్తము నీ కుడిచెయ్యి చేయునది నీ యెడమచేతికి తెలియకయుండవలెను.

**మనము చేసే ధర్మము రహస్యముగా వుండాలని దేవుడు చెప్తున్నాడు. ఈ రోజుల్లో ధర్మము ఎవరైనా చేస్తే అందరికి చెప్పుకుంటున్నారు . మనుష్యుల దగ్గర ఘనతను కోరుకుంటున్నారు. బాహాటముగా బ్యానెర్లపైన , flexie పైన పేర్లు, ఫోటోలు ముద్రించుకుంటున్నారు . ఇది దేవుని దృష్టికి తగినది కాదు .**

7. **రహస్యమందున్న తండ్రికి ప్రార్ధన: :**

మత్తయి 6:6 - నీవు ప్రార్థన చేయునప్పుడు, **నీ గదిలోనికి వెళ్లి తలుపువేసి, రహస్యమందున్న** నీ తండ్రికి ప్రార్థనచేయుము .

**నీ ప్రార్ధన జీవితము రహస్యముగా వుండాలి . ప్రార్ధనలో వ్యర్ధమైన మాటలు ఉండకూడదు**(మత్తయి6:7) . **కొద్దిమాటలైనను దేవునికి యోగ్య కరముగా వుండాలి . పరిశుద్దగ్రంధములో చాలా మంది భక్తుల ప్రార్ధనలు మనము చూడవచ్చు. యేసుక్రీస్తు వారు కూడా తండ్రికి ప్రార్ధన చేస్తూ వుండడం మనము గమనించవచ్చు.**

**ఈ సంవత్సరము మనము అందరము చేయవలసిన ప్రార్ధన ఏది అనగా**

లూకా 23:34 **యేసు తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను వారు .**

**ఈ ప్రార్ధన ప్రతి క్రైస్తవునికి ఎంతో అవసరము .**

**ఉదా : "True prayer is a way of life, not just for use in cases of emergency. Make it a habit, and when the need arises you will be in practice." --- బిల్లి గ్రాహం గారు .**

8. **రహస్య ఉపవాసము:**

మత్తయి 6:17 - ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని కాక, **రహస్యమందున్న నీ తండ్రికే కనబడవలెనని,** నీవు ఉపవాసము చేయునప్పుడు నీ తల అంటుకొని, నీ ముఖము కడుగుకొనుము.

**ఉపవాసములు రెండు రకములు 1) సంఘముతో కలిసి ఉపవాసము చాటించి వుండేది**(యోవేలు2:15,16) .

**2) వ్యక్తిగత ఉపవాసము**(మత్తయి 6:17) .

**నీ వ్యక్తిగత ఉపవాసము మాత్రము రహస్యమందు వున్న నీ తండ్రికి మాత్రమే కనపడవలెనని చేయాలి . ఉపవాసము ఏలాగున చేయాలో ఉపవాసము అనే అంశములో పూర్తిగా వివరించడం జరిగింది. దయచేసి గమనించగలరు .**

9. **మర్మము - రహస్యము :**

రోమా 16:25 - అనాదినుండి **రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్షపరచబడిన మర్మము,**

**అనాది నుండి దాచబడిన మర్మము ఎవరో కాదు యేసుక్రీస్తు. ఆయన ద్వారా మనకు సమస్తము బయలు పరచబడినది.**

10. **రహస్య శిష్యుడు:** (దేవునితో నీ సహవాసము రహస్యముగా ఉండకూడదు ):

యోహాను 19:38 - యూదుల భయమువలన **రహస్యముగా యేసు శిష్యుడైన అరిమతయియ యోసేపు,** తాను యేసు దేహమును తీసికొనిపోవుటకు పిలాతు నొద్ద సెలవడిగెను .

**అరిమతయియ యోసేపు వలె ఇప్పుడు నీవు యేసయ్యను రహస్యముగా వెంబడిస్తూ ఉంటే ఏదో ఒక సమయములో నీవు తెగించి బహిరంగంగా యేసును వెంబడించడానికి సిద్ధమవ్వాలి. అవసరమయితే ఆయన దేహమను సంఘము కొరకు నీవు దేనినైనా చేయుటకు సిద్దపడాలి.దేవునితో కలిసి 31/2 సంవత్సరములు ప్రయాణము చేసిన శిష్యుల కంటే రహస్యముగా ఆయనను వెంబడించిన అరిమతయియ యోసేపు దేవుని యెడల మిక్కిలి ప్రేమ చూపిన వాడిగా చూస్తున్నాము .**

**11. రహస్యముగా పక్షపాతము చూపకూడదు :**

యోబు 13:10 - మీరు **రహస్యముగా పక్షపాతము** చూపినయెడల నిశ్చయముగా ఆయన మిమ్మును గద్దించును.

దేవుడు పక్షపాతము లేనివాడు. మనము కూడా పక్షపాతము లేకుండా జీవించాలి(రోమా2:11, ఎఫెసి6:9). పక్షపాతము, మనిషికి ఒక అలవాటుగా మారింది .మనము రహస్యముగా పక్షపాతము చూపిస్తే దేవుడు గద్దిస్తాడు అని వాక్యము సెలవిస్తుంది.

**హెచ్చరిక :**

**1 కొరింథీయులకు 4:5 - కాబట్టి సమయము రాకమునుపు, అనగా ప్రభువు వచ్చు వరకు, దేనిని గూర్చియు తీర్పు తీర్చకుడి. ఆయన అంధకారమందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చి హృద యములలోని ఆలోచనలను బయలుపరచునప్పుడు, ప్రతి వానికిని తగిన మెప్పు దేవునివలన కలుగును.**

**ఒప్పుకోలు ప్రార్థన : కీర్తన 19 : 12 - తన పొరపాటులు కనుగొనగలవాడెవడు? నేను రహస్యముగా చేసిన తప్పులు క్షమించి నన్ను నిర్దోషినిగా తీర్చుము.**

కీర్తనలు51:3,4,5,11 నా అతిక్రమములు నాకు తెలిసేయున్నవి నా పాపమెల్లప్పుడు నాయెదుట నున్నది. నీకు కేవలము నీకే విరోధముగా నేను పాపము చేసి యున్నాను నీ దృష్టియెదుట నేను చెడుతనము చేసియున్నాను నేను పాపములో పుట్టినవాడను పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను. నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము నీ పరిశుద్ధాత్మను నాయొద్దనుండి తీసివేయకుము

**అని దావీదు రహస్యముగా తాను చేసిన పాపములు అతిక్రమములు ఒప్పుకొనుచున్నాడు. క్షమించమని కోరుతున్నాడు. నిర్దోషిగా తీర్చుమని బతిమాలు చున్నాడు. మన రహస్యపాపములు మనకు తెలియబడాలంటే ప్రభు ముఖాకాంతి (కీర్తన90:8) ప్రసరించే ఆయన మందిరములోనికి వచ్చి, ఆయన వాక్యపు వెలుగులో మన రహస్యపాపములు ఒప్పుకొని, విడిచిపెట్టుకుందాం.అలాంటి కృప పరిశుద్ధాత్మ దేవుడు అనుగ్రహించును గాక. ఆమెన్**